# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **71వ జాతీయ చలనచిత్ర అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిన్న ఢిల్లీలో ప్రదానం చేశారు.**

2. **భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈరోజు విజయవాడలో పర్యటిస్తారు.**

3. **అమరావతి రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టుల్లో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.**

4. **సమ్మక్క, సారలమ్మ గద్దెల అభివృద్ధికి, ఆ ప్రాంత పునర్ నిర్మాణానికి నిధుల కొరత లేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఈరోజు కనకదుర్గమ్మ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**

==========================

న్యూఢిల్లీలో 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిన్న ప్రదానం చేశారు. 2023 సంవత్సరానికి గానూ కేంద్రం ఇటీవల ఎంపిక చేసిన ఉత్తమ చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణులు ఈ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా నటుడు మోహన్ లాల్‌ను సినిమా రంగంలో అత్యున్నత గుర్తింపు అయిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో రాష్ట్రపతి సత్కరించారు. ఉత్తమ పీచర్ ఫిల్మ్ అవార్డును హిందీ చిత్రం '12th ఫెయిల్', ఉత్తమ హిందీ ఫీచర్ ఫిల్మ్ అవార్డును 'కటహల్: ఎ జాక్ఫ్రూట్ మిస్టరీ' చిత్రానికి ప్రదానం చేశారు. ఉత్తమ నటుడి విభాగంలో జవాన్ చిత్రానికి గాను నటుడు షారుఖ్ ఖాన్, 12th ఫెయిల్ చిత్రానికి నటుడు విక్రాంత్ మాస్సేను సత్కరించారు. ఉత్తమ నటి అవార్డును మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే చిత్రంలో నటనకు గాను నటి రాణి ముఖర్జీ స్వీకరించారు.

-------------------------

భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈరోజు విజయవాడలో పర్యటిస్తారు. ఈ మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుకోని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడలోని దుర్గ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ సాయంత్రం పున్నమిఘాట్ వద్ద 'విజయవాడ ఉత్సవ్'లో ఉపరాష్ట్రపతి పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నామని, రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టుల్లో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరారు. విజయవాడలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన లోక్ సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన బ్యాంకర్లకు 15 నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, కేంద్ర సహకారంతో చేపట్టిన ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

సమ్మక్క, సారలమ్మ గద్దెల అభివృద్ధికి, ఆ ప్రాంత పునర్ నిర్మాణానికి నిధుల కొరత లేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ములుగు జిల్లా, మేడారంలో జరిగిన బహిరంగ సభలో ఆయన నిన్న మాట్లాడారు. ఆదివాసి సంఘాలు, పూజారులు, సాంప్రదాయ కుటుంబాలను ఆలయ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ ఆలయ అభివృద్ధిలో రాతి నిర్మాణాలు చేపడతామని, తద్వారా ఆ నిర్మాణాలు శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. మహా జాతర నాటికి పనులు పూర్తవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతూ..

వాయిస్..19 సెకన్లు

-----------------------

జిఎస్టి 2.0 వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు డి.పురంధరేశ్వరి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో పోషకాహార మాసం నిర్వహిస్తున్నారు. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు పలు కార్యక్రమాలు నెలంతా కొనసాగుతాయి.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మిషన్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

..వాయిస్... 1. 35 సెకన్లు

---------------------------

విజయవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఈ రోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే అన్నపూర్ణ దేవిని దర్శించుకుంటే ఆకలిదప్పులు ఉండవని, సాక్షాత్తు పరమేశ్వరుడికే భిక్షపెట్టిన అన్నపూర్ణాదేవిని ధ్యానిస్తే ధనధాన్యవృద్ధి కలుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

మరోవైపు తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ రోజు నానబియ్యం బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలియజేస్తూ..

..వాయిస్.. 23 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================